- కేసీఆర్ సర్కారు హయాంలో దళితబంధుకు శ్రీకారం
- మొదటి విడత విజయవంతం
- మెదక్ జిల్లాలో 256 యూనిట్లు గ్రౌండింగ్
- 256 మందికి రూ.25 కోట్ల 60 లక్షలు
- ఒక్కో లబ్ధిదారుడికీ రూ.10 లక్షల ఆర్థిక సాయం
- వివిధ వ్యాపారాలతో ఆర్థికాభివృద్ధి
- రెండో విడత కోసం ఎదురుచూపులు



మెదక్ : దళిత బంధు మొదటి విడతలో పంపిణీ చేసిన ట్రాక్టర్లు, టాటా వాహనాలు (ఫైల్)

# రెండో విడతకు మోక్షమెప్పుడు..?

మెదక్, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : గత కేసీఆర్ ప్రభుత్వం దళితుల జీవితాల్లో వెలుగులు నింపి వారు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు దళితబంధు పథకానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. మొదటి విడత విజయవంతంగా లబ్ధిదారులంతా ఆనం దం వ్యక్తం చేశారు. ఈ పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందింది. తమ జీవితాలను మార్చే ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్న దళితులు రోజువారీ కూలీల నుంచి యజమానులుగా మారారు. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. మెదక్ జిల్లాలో మొదటి విడతలో మొత్తం 256 యూనిట్లు మంజూరు కాగా, 255 యూనిట్లకు సంబంధించి డెయిరీ షెడ్లు, ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, పాడి గేదెలు తదితర వ్యాపార మార్గాలను ఎంచుకున్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేసీఆర్ ప్రభుత్వం యూనిట్లను గ్రౌండింగ్ చేసింది.




### రెండో విడత గల్లంతేనా ?

కేసీఆర్ సర్కార్ అమలు చేసిన దళితబంధు పథకం రెండో విడత కోసం దళిత కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. అయితే గత సర్కారు హయాంలో ఒక్కో దళిత కుటుంబానికీ రూ.10 లక్షల ఆర్థిక సాయం చేయగా, కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితబంధు పథకాన్ని అంబేద్కర్ అభయహస్తం పేరుతో దళితులకు జీవనోపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చింది. అయితే, రెండో విడతలో మెదక్ జిల్లాలో సుమారుగా 3వేల మంది దళితులకు దళితబంధు అమలు చేయాలని కేసీఆర్ సర్కారు నిర్ణయించింది. కానీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో దానికి బ్రేక్ పడింది. అప్పటికే జిల్లావ్యాప్తంగా 1200 మంది లబ్ధిదారులను గుర్తించినప్పటికీ మంజూరు చేసే అవకాశం లేకుండాపోయింది. దీంతో, రెండో విడుత ప్రక్రియ మళ్లీ ఎప్పుడు మొదలువుతుందోనని ఎదురుచూస్తున్నారు.



టేక్మాల్ మండలం అసద్‌మహ్మద్‌పల్లిలో గొర్రెల యూనిట్‌తో దళితులు (ఫైల్)

### మొదటి విడత విజయవంతంగా..

మెదక్ జిల్లాలో రెండు నియోజకవర్గాలతోపాటు గజ్వేల్, ఆందోల్, దుబ్బాక, నారాయణఖేడ్ నియోజకవర్గాల పరిధిలో 256 మందికి మొదటి విడతలో దళితబంధు అవకాశం దక్కింది. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో వంద మంది చొప్పున, అలాగే ఆందోల్ నియోజకవర్గంలోని హసన్‌మహ్మద్‌పల్లిలో 56 మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 256 మందికి ఎంపిక చేసిన యూనిట్లు అందజేశారు. మెదక్ నియోజకవర్గంలోని హవేళీఘణపూర్ మండలం జక్కన్నపేటలో 20 మంది, మెదక్ మండలంలో కొంటూర్‌లో 20, నిజాంపేట మండలం రాంపూర్‌లో18, పాన్నపేట మండలం అబ్లాపూర్‌లో 18, రామాయంపేట మండలం శివ్వాయిపల్లిలో 7, చిన్నశంకరంపేట మండలం చందంపేటలో 17 మొత్తం 100 మందిని ఎంపిక చేశారు. అలాగే, నర్సాపూర్ నియోజకవర్గంలో కౌడిపల్లి మండలం వెంకటాపూర్ (బీ)లో 34, చిలిపిచెడ్ మండలం రాందాస్‌గూడలో 2, నర్సాపూర్ మండలం తిర్మలాపూర్‌లో 21, శివ్వంపేట మండలం తిమ్మాపూర్‌లో 18, వెల్దుర్తి మండలం రామంతాపూర్‌లో 23 మందికి వివిధ యూనిట్లు అందజేశారు. అయితే, ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలంలోని అసద్‌మహ్మద్‌పల్లికి 56 యూనిట్లు మంజూరుచేయగా, ఇందులో అధికంగా 13 మంది లబ్ధిదారులు డెయిరీలను ఏర్పాటు చేసుకున్నారు. ఆరు ట్రాక్టర్లు, ఒక హార్వెస్టర్, మూడు అశోక్ లెల్యాండ్, ఐదు గొర్రెలు, ఒకటి మినీ సూపర్‌బజార్, ఒక ఫర్టిలైజర్ షాపు, మూడు పౌల్ట్రీఫాంలు, మూడు బట్టల దుకాణాలు ఇలా రకరకాల ఉపాధినిచ్చే యూనిట్లను ఏర్పాటు చేసుకుని కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు.

## సంగారెడ్డి జిల్లాలో 5500 మంది ఎదురుచూపు

సంగారెడ్డి జనవరి 2,(నమస్తే తెలంగాణ): దళితుల తలరాత మార్చిన దళితబంధు పథకం అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కేసీఆర్ సర్కార్ దళితులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు దేశంలో ఎక్కడాలేనివిధంగా దళితబంధు పథకానికి శ్రీకారం చుట్టారు. మొదటి విడత దళితబంధు పథకంతో సంగారెడ్డి జిల్లాలోని దళితుల కుటుంబాల్లో వెలుగులు నిండాయి. దీంతో కేసీఆర్ సర్కార్ రెండోవిడత దళితబంధు అమలుకు శ్రీకారం చుట్టారు. సంగారెడ్డి జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో రెండోవిడతలో 1100 మందికి దళితబంధు పథకాన్ని వర్తింపజేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని అందోలు, జహీరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో మొత్తం 5500 మంది లబ్ధిదారులకు రెండో విడత దళితబంధు అమలుచేసేందుకు కేసీఆర్ సర్కార్ చర్యలు తీసుకున్నది. రెండోవిడత దళితబంధు పథకం అమలుకు నిధులు విడుదల చేయటంతోపాటు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టింది. అయితే ఎన్నికలు రావడంతో రెండోవిడత దళితబంధు పథకం అమలుకు బ్రేక్ పడింది. ఎన్నికలు ముగిసిన తర్వాత దళితబంధు పథకం అమలువుతుందని జిల్లాలోని దళితులు ఎదురుచూశారు. అయితే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దళితబంధు పథకం అమలును పట్టించుకోవటం లేదు. దళితుల జీవితాల్లో వెలుగులు నింపిన దళితబంధు పథకానికి బ్రేక్ వేయాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ప్రభుత్వం రెండోవిడత దళితబంధు అమలుకు చర్యలు ప్రారంభించ లేదు. దళితబంధు అమలుకు అవసరమైన నిధులు ఉండడంతోపాటు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొలిక్కివచ్చినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం దళితబంధు పథకం అమలుకు చేయటం లేదు. దీంతో దళితులు, దళితం సంఘాలు ప్రభుత్వం తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





### ఎన్నో ఆశలు పెట్టుకున్నా..

దళితబంధు వస్తే ట్రాక్టర్ కొందామని ఎన్నో ఆశలు పెట్టుకున్నా. నేను వ్యవసాయం చేస్తా ట్రాక్టర్ ఉంటే నాకు ఎంతో ఉపయోగపడేది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం లేకపోవడంతో రెండో విడత జాప్యం జరుగుతున్నది. మేము కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే దరఖాస్తులు చేసుకున్నా. ఈ లోగా ఎన్నికల కోడ్ రావడం.. ఎలక్షన్లలో బీఆర్‌ఎస్ పార్టీ ఓడిపోవడంతో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. మాకు దళితబంధు కింద సాయం అందజేసి సీఎం రేవంత్‌రెడ్డి ఆదుకోవాలి.

-గావు ప్రభాకర్, రామాయంపేట



### సెంట్రింగ్ వ్యాపారం చేయాలనుకున్నా..

సెంట్రింగ్ వ్యాపారం దళితబంధుకు దరఖాస్తు చేసుకున్నా. రూ.10లక్షలు వస్తే సెంట్రింగ్ మెటీరియల్ తీసుకోవచ్చని గంపెడాశతో ఉన్నా. నేను దరఖాస్తు చేసుకుని మూడు నెలలు కావస్తున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం లేకపోవడంతో మాకు వచ్చే దళితబంధు డబ్బులు ఆగిపోయాయి. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ పెద్దలు దళితబంధు ఇప్పించాలని కోరుతున్నా. దళితబంధు రాకుంటే జీవితాంతం కూలీ పనులు చేసుకోవడం తప్ప నాకు వేరే దారి లేదు.

-కందరి కాశీనాథ్, రామాయంపేట

## మొదటి విడతలో 444 మందికి లబ్ధి

దేశంలో ఎక్కడా లేనివిధంగా దళితులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేసీఆర్ సర్కార్ దళితబంధు పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రతిఒక్కరికీ రూ.10 లక్షల ఆర్థికసాయాన్ని అందజేసింది. సంగారెడ్డి జిల్లాలో మొదటి విడత 444 మంది లబ్ధిదారులకు దళితబంధు పథకం వర్తింపజేసింది. సంగారెడ్డి, అందోలు, నారాయణఖేడ్, జహీరాబాద్, పటాన్‌చెరు నియోజవర్గాల్లో వంద మంది చొప్పున లబ్ధిదారులకు దళితబంధు పథకాన్ని అందజేసింది. దళితబంధు డబ్బులతో లబ్ధిదారులు మినీ డెయిరీలు, వాహనాలు, జేసీబీలు, కంకర మిషన్లు, కిరాణషాపులు, బట్టల షాపులు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా స్థిరపడుతున్నారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గంలో 1100 దళితబంధు యూనిట్లను కేసీఆర్ సర్కార్ మంజూరు చేసింది. సంగారెడ్డి, అందోలు, జహీరాబాద్, నారాయణఖేడ్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో మొత్తం 5500 యూనిట్ల గ్రౌండింగ్‌కు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో ప్రతి నియోజకవర్గాల్లో రెండో విడత దళితబంధు కోసం దరఖాస్తులు తీసుకోవడంతోపాటు 5500 మంది లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను అధికారులు చేపట్టారు. ఎన్నికల కోడ్ కారణంగా రెండో విడత దళితబంధు పథకం అమలులో జాప్యం చోటుచేసుకుంది. ఎన్నికల ముగిసిన అనంతరం కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వ కొలువుతీరినప్పటికీ ఇప్పటివరకు రెండోవిడత దళితబందు పథకం అమలు చేయటం లేదు. రెండో విడత దళితబంధుకు అంతా సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో దళితుల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది. తమ నోటికాడికి వచ్చిన ముద్దను కాంగ్రెస్ ప్రభుత్వం రాకుండా చేస్తుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### మొదటి విడత దళితబందు పథకం అమలు

| నియోజకవర్గం | మండలం | గ్రౌండింగ్ |
|---|---|---|
| సంగారెడ్డి | కంది | 52 |
| | సదాశివపేట | 48 |
| పటాన్‌చెరు | జిన్నారం | 28 |
| | గుమ్మడిదల | 33 |
| | పటాన్‌చెరు | 39 |
| అందోలు | వటపల్లి | 44 |
| జహీరాబాద్ | మొగుడంపల్లి | 100 |
| నారాయణఖేడ్ | నారాయణఖేడ్ | 95 |
| | కల్హేర్ | 05 |

# అర్హులందరికీ ఆరు గ్యారెంటీలు

- ప్రజాపాలనతో ప్రజల ముందుకు ప్రభుత్వం
- ఖేడ్ నియోజకవర్గ అభివృదద్ధిపై ప్రత్యేక దృష్టి
- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- నారాయణఖేడ్‌లో ప్రజాపాలన, దవాఖానలో డయాలసిస్ సెంటర్ పరిశీలన


మన్సూర్‌పూర్ ప్రజాపాలనలో దరఖాస్తు స్వీకరించి రసీదు అందజేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

నారాయణఖేడ్, జనవరి 2: రాజకీయాలకతీతంగా అర్హులందరికీ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ మండలంలోని హన్మంత్‌రావుపేట్, నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు మన్సూర్‌పూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకాలను అమలుచేస్తున్నట్లు చెప్పారు. మిగతా గ్యారెంటీలను సైతం అమలుచేస్తామన్నారు.. 6వ తేదీ వరకు చేపట్టనున్న ప్రజాపాలన గ్రామసభల్లో ఆయా పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. అనంతరం మంత్రి మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించి రసీదులు అందజేశారు. పలువురికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు.

### ఖేడ్ దవాఖాన పరిశీలన

నారాయణఖేడ్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని, ఇక్కడి ఏరియా దవాఖానను చూస్తేనే ఈ విషయం అర్థమవుతుందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం మంత్రి నారాయణఖేడ్ ఏరియా దవాఖానను సందర్శించి ఆయావార్డులను పరిశీలించడంతో పాటు స్థానిక వైద్యాధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి డయాలసిస్ రోగులు, ఇతర రోగులను కలిసి సదుపాయాలపై ఆరా తీశారు. దశలవారీగా పూర్తిస్థాయిలో వైద్యులను నియమిస్తామని, దవాఖానలో అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. స్థానిక మాతా, శిశు దవాఖానకు అనుసంధానంగా మరో 50 పడకల దవాఖానను అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, మంత్రిని కోరారు.ఈ కార్యక్రమంలో జూకల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు, కలెక్టర్ శరత్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనాబేగం నజీబ్, ఎంపీపీ చాందిబాయిచౌహాన్, మాజీ ఎంపీ సురేశ్‌శెట్కార్, డీపీవో సురేశ్ మోహన్, డీఎంహెచ్‌వో గాయత్రిదేవి, ఆర్డీవో వెంకటేశ్, కౌన్సిలర్ నర్సింహులు, సర్పంచ్‌లు దత్తు, సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.


న్యాల్‌కల్ : మంత్రి దామోదర రాజనర్సింహను సన్మానిస్తున్న జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

### సమస్యల పరిష్కారానికే ప్రజాపాలన

న్యాల్‌కల్, జనవరి 2: ప్రజాసమస్యల పరిష్కారంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రజల వద్దకే అధికార యంత్రాంగం వెళ్తుందని వైద్యారోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మండలంలోని బసంత్‌పూర్‌లో ఆరు గ్యారెంటీల అమలులోభాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమఫలాలు అందిస్తామన్నారు. జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మాట్లాడుతూ అర్హులందరికీ గ్యారెంటీ పథకాలను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న గ్రామసభలో దరఖాస్తులు చేసుకునేందుకు ఫారాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తొలిసారిగా మండలానికి వచ్చిన మంత్రికి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మంత్రికి శాలువాకప్పి సత్కారించారు. మండలంలోని కల్‌బేమల్-రాజోలా మీదుగా జహీరాబాద్ ఆర్టీసీ డిపో నుంచి బస్సు నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కలెక్టర్ శరత్, డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మాజీ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి తమ్ము ప్రసాద్, ఆర్డీవో వెంకారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రశేఖర్, మండల ఎంపీపీ అంజమ్మ, వైస్ ఎంపీపీ గౌసొద్దీన్, గ్రామ సర్పంచ్ శ్యామల, మండల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవీకుమార్, నర్సింహారెడ్డి, డీఎల్పీవో రాఘవరావు, మండల తహసీల్దార్ భానుకిరణ్, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఎంపీడీవో వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రూ.90 కోట్ల అభివృద్ధి పనులు నిలిపివేత

- రాజకీయ కక్షతో అందోల్ అభివృద్ధిని అడ్డుకుంటున్న మంత్రి రాజనర్సింహ
- కేసీఆర్ ప్రభుత్వంలో మంజూరైన పనులు జరగనీయడం లేదు
- అందోల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను అడ్డుకోవడం అన్యాయం
- మంత్రి తీరుమార్చుకోవాలి.. అభివృద్ధి పనులు పూర్తి చేయాలి
- విలేకరులతో అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్


సంగారెడ్డిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

సంగారెడ్డి జనవరి 2 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తనపై ఉన్న రాజకీయ కక్షతో అందోలు నియోజకవర్గంలో అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని అందోలు మాజీఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం అందోలు నియోజకవర్గ అభివృద్ధికి వందల కోట్ల నిధులు మంజూరు చేసిందనన్నారు. ఇటీవల మంజూరైన నిధుల్లో రూ.350 కోట్ల పనులు పూర్తి కాగా, ఇంకా రూ.100 కోట్లకుపైగా పనులు వేర్వేరు దశల్లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అయితే ఈ పనులు నిలిపివేయాలని మంత్రి అధికారులకు మౌఖిక ఉత్తర్వులు ఇచ్చారని, దీంతో రూ.90 కోట్ల పనులు నిలిచిపోయినట్లు చెప్పారు. తనపై ఉన్న కక్షతో అందోలు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరగకుండా అడ్డుకోవడం అన్యాయమన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అందోలు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ముఖ్యంగా అందోలు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి, గ్రామాల్లో సీసీరోడ్లు, మురికి కాల్వల నిర్మాణం కోసం పెద్దమొత్తంలో నిధులు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తి కాకుండా మంత్రి ఆడ్డుకుంటున్నారని ఆరోపించారు. దీంతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయన్నారు.

### అభివృద్ధి పనులు నిలిపివేత

అందోలు నియోజకవర్గంలో రూ.90 కోట్లకుపైగా విలువైన పనులు నిలిచిపోయాయని మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ తెలిపారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి రహదారులు, కమ్యూనిటీ హాళ్లు, గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగుకాల్వల పనులకు సంబంధించి రూ.60 కోట్ల విలువైన పనులు నిలిపివేసినట్లు చెప్పారు. అందోల్ మండలంలో ఐదు, పుల్కల్‌లో ఆరు, వటపల్లి మండలంలో ఏడు, రాయికోడ్‌లో 14, అల్లాదుర్గంలో ఏడు, టేక్మాల్‌లో 22 రకాల అభివృద్ధి పనులు నిలిపివేసినట్లు చెప్పారు.ఆర్‌అండ్‌బీలో రూ.10కోట్ల విలువైన రహదారుల నిర్మాణం, మరమ్మతు పనులు నిలిపివేసినట్లు చెప్పారు. చాలాపనులకు సంబంధించి టెండర్లు పూర్తి అయినా పనులు కాకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. ఎమ్మెల్యేకు సంబంధించిన నియోజకవర్గ అభివృద్ధి నిధులు(సీడీపీ)లో రూ.3 కోట్ల విలువైన పనులు జరగకుండా నిలిపివేసినట్లు చెప్పారు. ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్)లో రూ.9 కోట్ల విలువైన పనులు జరగకుండా నిలిపివేశారన్నారు. ఎంపీ, ఎమ్మెల్సీ కోటాలో విడుదలైన రూ.2 కోట్ల పనులు, డీఎంఎఫ్‌లో మంజూరైన రూ.3 కోట్ల విలువైన పనులు పూర్తి కానివ్వకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. అందోలు మున్సిపాలిటీల్లో రూ.25 కోట్ల అభివృద్ధి పనులు జరగనీయడంలేదని, టెండర్లు నిర్వహించకుండా మంత్రి దామోదర అడ్డపడుతున్నారని ఆరోపించారు. మంత్రి తనపై ఉన్న రాజకీయ కక్షతో అందోలు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరగకుండా అడ్డుపడటం సరికాదన్నారు. మంత్రి హోదాలో అందోలు నియోజకవర్గానికి మరింత నిధులు తీసుకురావాలే తప్పా గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులు జరగకుండా అడ్డుకోవటం అన్యాయమన్నారు. మంత్రి వెంటనే కేసీఆర్ ప్రభుత్వం హయాంలో మంజూరైన అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. అందోలు నియోజకవర్గ అభివృద్ధికి తాను సంపూర్ణంగా సహకరిస్తానని చంటి క్రాంతికిరణ్ తెలిపారు. విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు సాయికుమార్, నారాయణ, విఠల్, విజయ్, వీరారెడ్డి, లింగాగౌడ్, బత్తులవీరన్న, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.